క్లుప్తంగా

మహానందిలో భక్తుల రద్దీ



కోనేరులో భక్తుల పుణ్యస్నానాలు

మహానంది: క్షేత్రంలో ఆదివారం సెలవురోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. స్వామి, అమ్మవార్ల దర్శనం ఉదయం నుంచి రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది.

9 నుంచి 'పల్లెకు పోదాం'

నందికొట్కూరు రూరల్ : ఈ నెల 9వ తేదీ నుంచి మండలంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రవియాదవ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు పల్లెకు పోదాం కార్యక్రమంతో పాటు ఏపీకీ జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.సర్పంచులు, ఎంపీటీసీలు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరం

ఆత్మకూరు: పట్టణంలోని అర్బన్‌కాలనీ సచివాలయ పరిధిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అర్బన్‌కాలనీ సచివాలయ పరిధిలోని ప్రజలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిబిరానికి హాజరు కావాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్‌తో పాటు, కౌన్సిలర్‌లు హాజరవుతున్నారని చెప్పారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

పగిడ్యాల: మండలంలోని పడమర వనుములపాడు గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పాల్గొంటున్న కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు విధిగా పాల్గొనాలని సూచించారు.

నూతన కమిటీ ఎంపిక

ఆత్మకూరు: పట్టణంలోని ధనుంజయమీటింగ్ హాల్‌లో ఆదివారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం మాట్లాడుతూ అధ్యక్షురాలిగా వెంకటరమణమ్మ, కార్యదర్శిగా మంజుల, కోశాధికారిగా లక్ష్మీదేవి, గౌరవ అధ్యక్షులు రామ్‌నాయక్, ఉపాధ్యక్షులుగా అరుణ,శ్యామల, దరగమ్మ, కార్యదర్శులుగా సావిత్రమ్మ, తులసమ్మ, కుమారి, ఈశ్వరమ్మ, సభ్యులుగా చంద్రకళ, ప్రియాంక, విజయలక్ష్మి, సమీరమ్మ, భాగ్యలక్ష్మి, అనిత, వసంత, లక్ష్మీనరసమ్మ, గౌరీ, పుష్పలతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణ పనుల పరిశీలన



ఎల్లమ్మను దర్శించుకొని బయటకు వస్తున్న దేవదాయ శాఖ స్థపతి పరమేశ్వరప్ప

కర్నూలు సిటీ: వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయాన్ని రూ.3 కోట్లతో పునర్నిర్మించనున్నారు. ఈ మేరకు ఆదివారం దేవదాయ శాఖ రాష్ట్ర స్థపతి పరమేశ్వరప్ప అమ్మవారి ఆలయాన్ని సందర్శించి, దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయం పునర్నిర్మాణ పనుల గురించి ఆలయ ఈఓ దినేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆలయం నిర్మాణం కోసం ప్రస్తుతం సుమారుగా 40 టన్నుల స్టోన్‌ను తెప్పించామని, ప్రస్తుతం శిల్పితో పాటు, వారి లేబర్ కోసం తాత్కాలిక షెడ్లు నిర్మించే పనులు చేపడుతున్నామని ఈఓ వివరించారు. అదే విధంగా ఆలయాన్ని పునర్నిర్మాణ దాత చెన్నైకి చెందిన సినీ నిర్మాత రాజ్‌కుమార్ త్వరలోనే ఇక్కడి రానున్నారని, శిల్పులు సైతం తమిళనాడు రాష్ట్రం నుంచి రానున్నారని తెలియజేశారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

గోస్పాడు: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరావు కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 11వ పీఆర్‌సీ అరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 20శాతం కరువు భత్యం బకాయిలు చెల్లించాలని, కేజీబీవీల్లో వార్డెన్లను నియమించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. కృష్ణారావు, భాస్కరరెడి పాల్గొన్నారు.

ఆత్మకూరులో అభివృద్ధి పరుగులు

- రూ.9.63 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు
- వివిధ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం
- పార్కుల ఏర్పాటుకు అధికారుల చర్యలు
- నీటి సమస్య పరిష్కారానికి ముందస్తుగా రూ.25లక్షలతో ప్రణాళిక

ఆత్మకూరు: పట్టణంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. మొత్తం 24 వార్డుల్లో దాదాపు 20 వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, మున్సిపల్ అధికారులు దగ్గర ఉండి పనులు చేయిస్తున్నారు. వివిధ కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి.

అభివృద్ధి పనులు ఇలా..

టీడీపీ ప్రభుత్వంలో నగర మున్సిపాలిటీగా ఉన్న ఆత్మకూరును మున్సిపాలిటీగా మారుస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీఓను విడుదల చేస్తుంది. ప్రస్తుతం ఆత్మకూరు మున్సిపాలిటీలో ఉన్న నిధులతో పాటు ప్రభుత్వం అందించే ఫైనాన్స్ కార్పొరేషన్ అందించే నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టారు. 2019లో 14వ ఫైనాన్స్ నిధుల కింద 19వ వార్డులో కళాంజోరి గ్రాఫిక్ నుంచి ధర్మారెడ్డి ఇంటి వరకు రూ.5 లక్షలతో, అదే ఏడాది గంగమ్మ ఇంటి నుంచి ముర్తుజావలి ఇంటి వరకు రూ.6 లక్షలు, 2021, 22 నందు సుబాని ఇంటి నుంచి కోనేరు పబ్లిక్ వరకు రూ.21 లక్షలతో సీసీరోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం 14వ ఫైనాన్స్ నుంచి 48 పనులకు రూ.3.78కోట్లు, 60 పనులకు రూ.2.70 కోట్లు, ఎస్ఎస్‌సీ కింద మూడు పనులకు రూ.75 లక్షలు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద 58 పనులకు రూ.1.60 కోట్లు , వైఎస్సార్ అర్బన్ హెల్త్ కేంద్రానికి రూ.80 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. పట్టణంలోని 24 వార్డుల్లో 20 వార్డుల్లో సీసీ రోడ్ల పనులు సాగుతున్నాయి. మొత్తం మీద రూ.9.63 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

నీటి సమస్య పరిష్కారానికి..

పట్టణంలో వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని మంచి నీటి సమస్య పరిష్కారం కోసం దాదాపు రూ.25 లక్షలతో నీటి సరఫరాకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశారు.నీటి సమస్య ఏర్పడితే ఆయా కాలనీలకు ట్యాంకర్ల ద్వార నీటిని అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పార్కుల ఏర్పాటుకు చర్యలు..

పట్టణంలో ఆహ్లాద వాతావరణం కోసం పార్కులు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. పార్కుల ఏర్పాటుకు అవసరమైన స్థలాల కోసం అధికారులు అన్వేషిస్తున్నారు. ఏ ఏ కాలనీల్లో పార్కులు ఏర్పాటు చేయాలి, ఇందుకు ఎంత మేర ఖర్చవుతుంది తదితర విషయాలపై ప్రణాళికలను సిద్ధం చేశారు.త్వరలో ప్రతిపాదనలు పూర్తి చేసి నివేదికలు పంపనున్నారు.



పట్టణంలో ఊపందుకున్న డ్రైనేజీ పనులు,



కాలనీలో సీసీ రోడ్డు వేసి క్యూరింగ్ చేస్తున్న దృశ్యం

పార్కులు ఏర్పాటు చేయాలి



ఆత్మకూరులో ఎన్నో ఏళ్లుగా పార్కులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం వేళ మార్నింగ్‌వాక్, కుటుంబ సభ్యులతో కలిసి ఆహ్లాదంగా గడిపేందుకు అనువైన వాతావరణం లేదు. పార్కులు ఏర్పాటు చేయాలని గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదు. ఇప్పుడు చర్యలు చేపడుతుండటం అభినందనీయం. – వరాల మాలిక్, ఆత్మకూరు

మరింత అభివృద్ధి చేస్తాం



మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం. పార్కులు ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాం. ఎక్కడెక్కడ పార్కులు ఏర్పాటు చేయాలనే అంశాలపై దృష్టి సారించాం. త్వరలో వీటితో పాటు అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు పూర్తి చేస్తాం. ఆత్మకూరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాం.
–ఆసియామారూఫ్, మున్సిపల్‌చైర్‌పర్సన్

నేడు ప్రత్యేక కార్యక్రమాలు

మహానంది: పేదల కష్టాలు తెలుసుకునేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఆయా మండలాల అధ్యక్షులు కొమ్మా మహేశ్వరరెడ్డి, బారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ బండిఆత్మకూరు, బుక్కాపురం గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి సంబరాలు చేస్తున్నట్లు తెలిపారు.

ఆత్మకూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర సోమవారం నాటికి 6 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్ విగ్రహాలకు పాలాభిషేకం, పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి నంద్యాల టర్నింగ్‌లోని వైఎస్సార్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామని, అక్కడ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. అలాగే ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తనయుడు శిల్పా కార్తీక్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా పార్టీ కార్యాలయం, గౌతమి మోడల్‌స్కూల్‌లో బ్లడ్ క్యాంప్ నిర్వహిస్తామన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం రుద్రపార్క్ సమీపంలోని క్రీడా మైదానంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ముడావత్ మల్లికార్జున నాయక్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన పోటీలను వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ ఎంఏ రజాక్ ప్రారంభించారు. కుమార్, అనీల్‌కుమార్, భరత్ పాల్గొన్నారు.

తూడిచెర్ల సబ్‌ఛానల్‌కు 560 క్యూసెక్కుల నీటి సరఫరా

జూపాడుబంగ్లా: తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 560 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు కర్నూలు–కడప కాల్వ ఏఈ లు నరేష్, శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల పథకాల ద్వారా కేసీ కాల్వకు 1,330 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. రైతుల వినియోగార్థం లాకిన్స్‌లా వరకు 1,100 క్యూసెక్కుల నీరు చేరుతుండగా తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 560 క్యూసెక్కులు, అలగనూరు రిజర్వాయర్ కాల్వకు 40 క్యూసెక్కులు, నిప్పులవాగుకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని చెప్పారు. ఈ నెలాఖరు వరకు మాత్రమే కేసీ కాల్వకు నీరు సరఫరా అయ్యే అవకాశం ఉన్నందున రైతులు నీటి పొదుపుగా వినియోగించుకోవటంతో పాటు తక్కువ నీటి వనరులతో పండే పంటలు సాగుచేసుకోవాలని సూచించారు.



కేసీ కాల్వలో ప్రవహిస్తున్న సాగునీరు

సామాజిక స్పృహ పెంపొందించేందుకే 'బాలోత్సవ్'



మాట్లాడుతున్న శంకరయ్య

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థుల్లో సామాజిక స్పృహ, అభ్యుదయ ఆలోచనను పెంపొందించేందుకే నంది బాలోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అమరావతి బాలోత్సవం రాష్ట్ర కార్యదర్శి రామరాజు అన్నారు. ఆదివారం నంది బాలోత్సవ కార్యక్రమం విజయవంతం కోసం ఆహ్వాన సంఘం సమావేశం రామకృష్ణ డిగ్రీ కళాశాల మినీ ఆడిటోరియంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా భగత్‌సింగ్ గ్రంథాలయం సంస్థ చైర్మన్ న్యాయవాది బి.శంకరయ్య అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ బాలోత్సవ కార్యక్రమంలో సబ్ జూనియర్, సీనియర్స్ మూడు విభాగాల్లో 40 రకాల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 15 రంగాలు, సాంస్కృతిక పోటీలు, 25 అకాడమిక్ పోటీలు చేపడుతున్నామన్నారు. పోటీల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని కోరారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను బయటకు తీయడం కోసం నంది విజ్ఞాన కేంద్రంలో బాలోత్సవాన్ని డిసెంబర్ 7, 8 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి గోపాల్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, సుధాకర్ పాల్గొన్నారు.

మహిళా ఓటర్లే కీలకం

- మహానంది మండలంలో మొత్తం 29,442 ఓటర్లు
- మహిళలు 15,008, పురుషులు 14426

మహానంది: రాబోవు ఎన్నికల్లో మహానంది మండలంలో మహిళా ఓటర్లే కీలకంగా మారనున్నారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీలు, ఆరు మజరా గ్రామాల్లో కలిపి మొత్తం 29,442 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళలు 15,008 ఉండగా పురుషులు 14,426, ఎనిమిది మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. పురుషుల ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉండటంతో ఎన్నికల ఫలితాల్లో మహిళల ఓట్లే కీలకంగా మారనున్నారని మండల ప్రజలు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. మొన్నటి వరకు మండలంలో 11 గ్రామ పంచాయతీలు ఉండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అల్లినగరం, గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామాలు నూతనంగా పంచాయతీలు ఆవిర్భవించాయి.

మొత్తం 37 పోలింగ్ స్టేషన్లు

మహానంది మండలంలో మొత్తం 37 పోలింగ్ స్టేషన్లు ఉన్నట్లు తహసీల్దార్ జనార్దన్‌శెట్టి తెలిపారు. శ్రీశైలం నియోజకవర్గంలోని 190వ నంబరు నుంచి 226 వరకు పోలింగ్ స్టేషన్లు మండలంలో ఉన్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా ఓటర్ల జాబితాలు సంబంధిత గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్ల వద్ద బీఎల్‌ఓల దగ్గర అందుబాటులో ఉంటాయన్నారు. ఈ నెలలో మరోసారి ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే ఆన్‌లైన్ లేదా నేరుగా ఫిర్యాదులు చేయవచ్చని సూచించారు.

తాటిపాడు బుక్‌కీపర్ రాజీనామా

జూపాడుబంగ్లా: తాటిపాడులో బుక్‌కీపర్‌గా విధులు నిర్వహిస్తున్న దినేష్ ప్రవీణ్‌రాజు వ్యక్తిగత కారణాల వల్ల విధుల నుంచి విరమించుకొంటున్నట్లు లిఖితపూర్వకంగా తెలియజేశాడని ఏపీఎం అంబమ్మ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ గ్రామంలోని భారతి గ్రామైఖ్య సంఘం అధ్వర్యంలోని సుమారు 35 పొదుపు గ్రూపుల నిర్వహణకు సంబంధించి బుక్‌కీపర్‌గా దినేష్‌ప్రవీణ్‌రాజు వ్యవహరిస్తున్నాడు. గ్రామంలో 65 పొదుపు సంఘాలుండగా ఇద్దరు బుక్‌కీపర్లుగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దినేష్‌ప్రవీణ్‌రాజు రాజీనామా చేసినందున అతని స్థానంలో కొత్తవారిని నియమిస్తామని చెప్పారు. ఇంటర్, డిగ్రీ అర్హత ఉండి ఇదివరకు బుక్‌కీపర్‌గా విధులు నిర్వహించిన అనుభవం ఉండి, గ్రామస్తులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో ఆదివారం 1992–94 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. వారు నాటి జ్ఞాపకాలను నెమరవేసుకొని సంతోషంగా గడిపారు. 29 ఏళ్ల తరువాత కలుసుకోవడం సంతోషంగా ఉందని పలువురు పేర్కొన్నారు. అప్పట్లో విధులు నిర్వహించిన హిస్టరీ లెక్చరర్ మురళీకృష్ణ, ఇంగ్లిష్ లెక్చరర్ వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు, హైస్కూల్ హెచ్ఎం నాగరాజు, రిటైర్డ్ పీడీ శివలక్ష్మీరెడ్డి, ప్రస్తుత అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు నాడు క్రమశిక్షణతో విద్యనభ్యసించారని, నేడు వారు వివిధ రంగాల్లో రాణిస్తుండడం సంతోషంగా ఉందన్నారు.



నాటి అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

ఓంకారంలో భక్తుల సందడి

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన ఓంకారంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శ్రీ గంగా, ఉమా సమేత ఓంకారసిద్ధేశ్వర స్వామిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. అనంతరం మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకుని శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అలాగే నవనందుల్లోని కృష్ణనంది, శివనంది క్షేత్రాల్లో భక్తులు పూజలు చేపట్టారు. ఆలయ పరిసరాల్లోని నల్లమల అందాలు భక్తులు, పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి.

బహుజనులు చైతన్యం కావాలి

నందికొట్కూరు: బహుజనులు చైతన్యవంతం కావాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ అర్ జే మల్లికల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. పట్టణంలో పార్టీ కార్యాలయంలో పోస్టర్లు విడుదల చేశారు. పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మహేంద్ర, జిల్లా ఇన్‌చార్జ్ గద్దల లాజర్, నందికొట్కూర్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఎల్.స్వాములు, నందికొట్కూరు అధ్యక్షుడు నాగన్న పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంట్లో చోరీ



బీరువాలో వస్తువులు చెల్లాచెదురుగా పడిఉన్న దృశ్యం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని ఎస్‌జీఓ కాలనీలో నివాసముంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కిశోర్ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. టూటౌన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కిశోర్ హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కొంత కాలంగా వర్క్‌ఫ్రమ్ హోం కారణంగా ఇంట్లోనే ఉంటున్నాడు. శుక్రవారం కడపలో బంధువులను కలిసేందుకు భార్య, పిల్లలతో కలిసి వెళ్లాడు. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరచి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. అయితే దొంగలు ఎంత సొత్తు దోచుకెళ్లారనే వివరాలను కిశోర్ సరిగా వెల్లడించటంలేదని, కేసు నమోదు చేసి విచారిస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

శ్రీశైలంలో దుకాణాల కేటాయింపు

శ్రీశైలం: శ్రీశైల దేవస్థానం పరిధిలోని లలితాబజార్ షాపింగ్ కాంప్లెక్స్, క్యూ, ఆర్ బ్లాక్స్‌లలో 24 మంది వ్యాపారులకు దుకాణాలను కేటాయిస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల మేరకు కమిషనర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో జె,కె,ఎల్ బ్లాకుల మధ్య ఉన్న ఈ–టాయిలెట్స్‌ను తొలగించి వాటి స్థానంలో క్యూ, ఆర్ బ్లాకులను నిర్మించి తిరిగి షాపుల కోసం తొలగించారు. మళ్లీ అదే స్థానంలో క్యూ, ఆర్ బ్లాకులను నిర్మించి షాపుల కేటాయింపు కోసం హైకోర్టును ఆశ్రయించిన 24 మందికి క్యూ బ్లాకులో 12 షాపులు, ఆర్ బ్లాక్‌లో 12 షాపులను నిర్మించి ఇవ్వాల్సిందిగా కోరారు. అలాగే హైకోర్టు, కమిషనర్ ఉత్తర్వుల మేరకు మొత్తం 24 షాపులకు ఒక్కో దుకాణానికి రూ.27 వేల నెలసరి అద్దె చెల్లించాల్సిందిగా ఆదేశాల జారీ చేశారు. దీనిపై జె,కె, ఎల్ బ్లాకుల వద్ద దుకాణాలు నిర్మించుకున్న వారు ధర్నాకు దిగారు. గత నెలలోనే అగ్నిప్రమాదం జరిగి 14 షాపులు కాలిబూడిదయ్యాయని, తిరిగి ఆ షాపుల ముందే టాయిలెట్స్‌లను తొలగించి క్యూ, ఆర్ బ్లాక్స్ పేరుతో షాపులు నిర్మించాలని ఆదేశించడం పట్ల తమకు పూర్తిగా అన్యాయం జరిగిందని న్యాయం చేయాలని కోరారు. కోర్టు ఆదేశాల మేరకు కేటాయిస్తున్నామని దేవస్థానం ఏఈఓ ఫణిదరప్రసాద్, రెవెన్యూ అధికారులు, ఎస్ఐ లక్ష్మణరావు దుకాణాదారులకు సూచించారు.



ధర్నా చేస్తున్న దుకాణదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత



కర్నూలులో చాకలి నాగమ్మ నుంచి వేలిముద్ర తీసుకుంటున్న వలంటీర్ లక్ష్మిదేవి



షేక్ మునిరుద్దీన్ నుంచి వేలిముద్ర తీసుకుంటున్న వెల్ఫేర్ అసిస్టెంట్ షేక్ మహమ్మద్ ఇక్బాల్

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామానికి చెందిన చాకలి నాగమ్మ అనే వృద్ధురాలు తలకు గాయమై ప్రస్తుతం కర్నూలులోని అమీలియో హాస్పిటల్‌లో కోమాలో ఉండి చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ చిలుక లక్ష్మీదేవి హాస్పిటల్‌కు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేసింది.

కొత్తపల్లి: మండలంలోని శివపురం గ్రామానికి చెందిన షేక్ మునిరుద్దీన్ గుండె సంబధిత వ్యాధితో బాధపడుతూ నంద్యాలలో ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొంది అక్కడే తన కుమారుడి ఇంట్లో ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న వెల్ఫేర్ అసిస్టెంట్ షేక్ మహమ్మద్ ఇక్బాల్ ఆదివారం నంద్యాలకు వెళ్లి లబ్ధిదారునికి వృద్ధాప్య పింఛన్ అందజేశాడు.

కొత్తూరులో తగ్గిన భక్తుల రద్దీ

పాణ్యం : మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని ఆదివారం భక్తులు తక్కువ సంఖ్యలో దర్శించుకున్నారని ఈఓ రామకృష్ణ తెలిపారు. ఆష్టమి సందర్భంగా గతంలో కంటే భక్తుల రద్దీ తగ్గిందని చెప్పారు. దాదాపుగా 2వేల మంది స్వామి వారిని దర్శించుకున్నట్లు తెలిపారు. దర్శనానికి గంట నుంచి గంటన్నర వరకు సమయం పట్టిందన్నారు.

కొత్తూరులో అడిషినల్ ఎస్పీ పూజలు

పాణ్యం : శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వస్వామి ఆలయంలో ఆదివారం నంద్యాల జిల్లా ఏఆర్ అడిషినల్ ఎస్పీ చంద్రబాబు కుటుంబ సమేత పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ చరిత్ర గురించిఅర్చకులను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.



అడిషినల్ ఎస్పీ దంపతులకు తీర్థప్రసాదాలు అందిస్తున్న సిబ్బంది, అర్చకులు

ఓటరు నమోదు పకడ్బందీగా చేపట్టండి

- ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను తనిఖీ చేసిన ఆర్డీఓ
- నియోజకవర్గంలో 251 పోలింగ్ కేంద్రాల నుంచి 268 దరఖాస్తులు

జూపాడబంగ్లా: ఓటర్ల నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీఓ ఎం.దాసు తెలిపారు. ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం సందర్భంగా మండలంలోని తూడిచెర్ల గ్రామ ప్రాథమిక పాఠశాల వద్ద చేపట్టిన ఓటరు నమోదు ప్రక్రియను తనిఖీ చేశారు. బీఎల్ఓ సునీత పోలింగ్ కేంద్రం వద్ద ఉండి ఓటర్ల పేర్ల చేర్పులు, మార్పులకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. ఆర్డీఓ మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన యువతీ, యువకులకు సంబంధించిన ఓటు హక్కు నమోదు చేసేందుకు అవసరమైన ధృవపత్రాలు తీసుకొని పక్కా సమాచారంతో ఓటు హక్కు నమోదు చేయాలని సూచించారు. అలాగే ఓటర్ల పేర్లు, అడ్రస్సులు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు వంటి వాటికి సంబంధించిన ఆధారాలతో చేయాలని ఆదేశించారు. ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపులకు సంబంధించిన సమాచారాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి చేపట్టాలన్నారు. అనంతరం ఆర్డీఓ విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో ఉన్న 251 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు 268 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఓటు హక్కు నమోదుకు సంబంధించి 217 దరఖాస్తులు రాగా, ఓటు హక్కు తొలగింపుకు సంబంధించి 14, పేర్లు, అడ్రస్ మార్పులకు 37 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. మండలంలోని 33 పోలింగ్ బూతుల నుంచి ఓటర్ల నమోదుకు 25దరఖాస్తులు, తొలగింపుకు సంబంధించి ఒకటి, మార్పులకు సంబంధించి 2 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ పుల్లయ్య యాదవ్ తెలిపారు.

పాములపాడు: కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారికి అవగాహన కల్పించాలని ఆత్మకూరు ఆర్డీఓ దాసు సూచించారు. ఆదివారం మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్వోలు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఆర్డీఓ దాసు మండలంలోని యర్రగూడూరు, పాములపాడు, మిట్టకందాల గ్రామాల పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ మళ్లీ డిసెంబరు నెల మొదటి శని, ఆదివారాల్లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.



పాములపాడు పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్వోలతో మాట్లాడుతున్న ఆర్డీఓ దాసు



జాబితాను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పగిడ్యాల: మండలంలోని 31 పోలింగ్ కేంద్రాల్లో చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి స్పందన కరువైంది. రెండు రోజులుగా కొనసాగిన ఓటరు నమోదు కార్యక్రమంలో బూత్ లెవెల్ ఆఫీసర్లు తమకు కేటాయించిన బూత్‌లలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించినా ఫారం–6, ఫారం–7, ఫారం–8కు ఒక్క అర్జీ కూడా నమోదు కాలేదని తహసీల్దార్ భారతి ఆదివారం తెలిపారు.

చురుగ్గా ఓటరు నమోదు

శ్రీశైలం: తహసీల్దార్ రాజేంద్రసింగ్ పర్యవేక్షణలో మండల వ్యాప్తంగా 27 పోలింగ్ బూత్‌ల వద్ద ఓటరు నమోదును ప్రారంభించారు. శ్రీశైల దేవస్థానం పరిధిలోని 10 పోలింగ్ బూత్‌లను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎంఏ రజాక్, బూత్ లెవల్ ఆఫీసర్, సచివాలయ ఉద్యోగులతో కలిసి ఓటర్ జాబితాను పరిశీలించారు. తప్పుగా నమోదైన ఓటర్ల సవరణను బీఎల్ఓ దృష్టికి తీసుకొచ్చారు.